దంటే, ఆ అమ్మ తర్వాత ఇంకా పెళ్ళి కావలసిన అమ్మలు, అయ్యలు కూడా ఉన్నారు. తినేనోరు ఒకటి తగ్గినా కుటుంబ భారం కొంత తగ్గినట్లే అని భావిద్దామంటే ఇది ఎడతెగని సమస్యగా పరిణమించింది. ఇటుపైని ఏమిచెయ్యను? అల్లుడి స్థితి చూస్తే ఆశాజనకంగాలేదు. ఇంక ఆ పిల్లకి చదువు చెప్పించే స్తోమత నా దగ్గరలేదు! లేదు! లేదు! అల్లుడు కనక ఏలుకోకపోతే ఇన్నాళ్ళూ పడి ఉన్నట్టే పడుంటుంది సరే! ఎదిగిన పిల్లని ఎన్నాళ్ళని ఇంటిలో పెట్టుకోను. నేను తలెత్తుకోలేకుండా ఉన్నాను. ఈ విషయమిట్లాగుండగా నేను తిండి పెట్టనూలేక దానిని సంపాదించుకోనియ్యక అదెట్లాగు బతకడం? కాబట్టి మొదట దాని ఉద్యోగం సంగతి చూసి తర్వాత అల్లుడి మాట కనుక్కుంటాను. పడవలసిన ఇబ్బందులు పడక తప్పదు!" అనుకొన్నాడు. అతను ఉద్యోగ ప్రయత్నం గట్టిగా చేశాడు.

కింకిణమ్మకి స్థానిక సంస్థలో గుమాస్తా పదవి లభించింది. ఆమెయే తెగించి భర్తకి ఉత్తరం రాసింది. అది చదువుకొని శారదాపతి పరమాశ్చర్యపోయేడు. కోడలి దగ్గరికి ప్రయాణంకోసం మూటలు సిద్ధపరచింది తల్లి.

స్కెచ్

# "నువ్వు కాబట్టి—"

రంధి సోమరాజు

గాలి వీచింది, ధూళి లేచింది. ఇక చూడండి ఆ వీచినగాలి, లేచినధూళి సలిపే సరసాలు! మనుషున్నారని కాస్త ఆ మొహాలకు సిగ్గేనా లేదు. నడివీధిలో ఇచ్చవచ్చినట్లు ప్రణయోన్మాదంతో పరుగులు పోతున్నాయి. ఇదంతా భరించలేని మనసు ఇంటికిదారితీసింది. దారితీయడమైతే జరిగింది కాని—అడుగు పడటం లేదు. 'అప్పుడే ఇంటికి వెళ్ళడమేమిటి? ఇంకా దీపాలైనా పెట్టే వేళ కానేలేదు. అయినా ఈ వేళప్పుడు ఇంటికి అఘోరించిందెప్పుడు? ఇలా ఈ సమయంలో ఇంటికి వెళ్ళడం...అదో క్రొత్తగా ఉంది. మా వీధిలోని సుందరీమణులంతా చూసి నవ్వుతారేమో-వాళ్ళ సోదరీమణికోసం ఇంత జరూరుగా హాజరైనందుకు! కాని ఈ దుమ్మురాక్షసి ఈ గాలి రాక్షసుడూ ఇలా పేట్రేగిపోతూంటే—ఇక వెళ్ళక తప్పుతుందా ఏమిటి? అదేమిటో గాని కంట్రోల్సు ఎత్తెయ్యగానే కొండంత ఎత్తున లేచి, షావుకారు ప్రియుణ్ణి బిగ్గరగా కౌగిలించుకుంటూన్న ఎంతో ప్రియమైన బియ్యం ధరల్లాగ, ఒకటే లేచిపోతూంది దుమ్ము! ఆ ధరా, ఈ దుమ్మూ సరిగ్గా ఒక్కటే; మన ప్రాణాలు తియ్యడానికి!

ఇష్టంలేకుండా శరీరాన్ని అలాంటి వేళప్పుడు ఇంటికి చేరవేయడమనేది నేనెప్పుడూ చేయలేదు. కానయితేనేం ఆనాడు జరిగింది. ఆనాడు ఇంకొకటికూడా జరిగింది. అది మా ఆవిడ ఏనాడూ లేనిది అన్ని పనులూ చక్కబెట్టుకొని కేవలం నా రాకకోసమే అన్నట్టుగా ఎదురుచూస్తూ కూర్చోవడం! ఏదో విశేష ముందనుకున్నాను. ఉందనే సూచన ఆమె మొహంలో స్పష్టంగా వ్రాయబడే ఉంది. పై పెచ్చు ఓ చిరునవ్వు సగంసగంగా ప్రదర్శించి మిగతాసగాన్ని మింగేసింది. "ఏమిటీ"అన్నట్టుగా నేను నవ్వాను. ఇప్పుడప్పుడే చెప్పడానికి వీల్లేదన్నట్టుగా ఆమె కళ్ళు పోజుపెట్టాయి. సరేలే, చెప్పకుండా ఎక్కడికి పోతుందనుకుంటూ స్నానానికి నీళ్లు పడేయమన్నాను. ఆమె నిముషాలమీద పని ముగించింది. నేనుకూడా త్వరలోనే తెమిల్చిపారేశాను. అప్పటికందుకుంది మా ఆవిడ. "ఎప్పుడూ లేదు; ఇంత త్వరగా దయచేశారేం" అంటూ. అందుకు నేనేమీ జవాబు చెప్పలేదు. అయినా దానికామె జవాబు పొందవలసిన అవసరమే లేదన్నట్టుగా తేరుకుని—మళ్ళీ తనే—"మీకో మంచివిషయం చెబుతాను; మీ రేదేనా బహుమతీ ఇస్తానంటే"

అంది-ఉండబట్టలేక కాబోలు ఊరింపుగా. వెంటనే నేను "మంచి విషయాలకు లంచాలేమిటి నీ మొహం" అన్నా. ఆమె వెనువెంటనే, "అదేమిటండోయ్. బహుమతులు, లంచాలు కావుగా!" అంది పెద్ద తెలివితేటలుపయోగించేటట్టు. "సరేలే అదేమిటో ఊరించక చెప్పూ" అన్నా. "మరి బహుమతి మాట" అంది. "అసలు నువ్వు చెప్పేది మంచివిషయమౌనో కాదో నేను తేల్చకుండా బహుమతీ ఎట్లా నిర్ణయించడం?" అన్నాను తెగ తెంపుగా. ఆమె నిరుత్సాహపడిపోలేదు. అలా అయిపోకుండా, "పోనీ అదేమిటో మీరు గ్రహించుకోండి చూద్దాం" అంది. వెంటనే నా కంతా అవగాహన అయిపోయింది. ఇట్లా మాట్లాడేవాళ్లు దేనిగురించి చెప్తారో నాకు సులువుగానే అర్థమైపోయింది. ఇన్ని సినిమాలు చూస్తున్నాం, ఇన్ని కథలు చదువుతున్నాం-కనీసం ఆ మాత్రమైనా చెప్పలేమా? అంచాత వెంటనే, "కొంపతీసి కడుపుతో ఉన్నావేమిటీ" అన్నా, ఉన్న గంపెడు పిల్లల్నీ పెంచలేక చస్తూన్నట్టు! ఆమె వెంటనే "ఛా—పొదురూ" అంది, ఇవేమి మాటలూ అన్నట్టు. నేను వెంటనే కుంగిపోయాను. ఎంత తప్పుడుఅంచనా వేశాను! తప్పుగా చెప్పాను కాబట్టి, ఆ విధంగా ఓడిపోయాను కాబట్టి నాలో కోపం ముంచుకొచ్చి, "అయితే నాకు తెలియదు ఫో" అన్నా. ఐతే ఆమె ఓపట్టాన వదలొద్దూ? "పోనీ కనీసం మన ఇంట్లో లేనిదేమిటో చెప్పండి" అంది, పిల్లల ద్వారానే సమాధానం వినడానికి ప్రయత్నించే మంచి ఉపాధ్యాయుడులా. ఈ ప్రశ్న వినగానే నాకు విరాకొత్తింది. "ఆ మనింట్లో చాలా ఉన్నాయి—లేనివి. చెప్తాను వ్రాసుకో" అన్నా. అందుకామె "అబ్బే అవేవీ కాదండీ. మనం రోజూ అనుకుంటూ ఉంటాం కదండీ. ఫలానిది ఉంటే బాగుండునని, అదేమిటో సెలవియ్యండి" అంది. వెంటనే నేను "ఏమిటీ వెండి నేతిగిన్నా? చంపావు. కొంపతీసి నువ్వు కొనేశావేమిటి? అందుకనే కాబోలు జేబులో డబ్బులు లెక్క చూసుకుంటే తక్కువయ్యాయి" అన్నా దొరకని దొంగను సునాయాసంగా పట్టేసినట్టు. వెంటనే ఆమె చాలా నిరుత్సాహపడిపోయి, "అదేమిటీ! మీ జేబులో డబ్బులు తియ్యడమేమిటీ? ఇక ఈ నింద లొక్కటే తక్కువ నా మొఖానికి" అంది. నాకూ వెనువెంటనే చాలా బాధ కలిగింది. పాపం! ఎప్పుడూ నా జేబులోని కానీ ముట్టుకున్న పాపాన పోలేదు. ఇలాంటి నింద ఆమెపై మోపడం తప్పే. కాని, "ఈ వెండిగిన్నె ఎక్కడిది" అని అడిగేశాను ఉండబట్టలేక. పాపం ఎంత ఉత్సాహంగా చెప్పాలనుకున్నదో అంతా క్రుంగిపోయి "మన స్నానాల దొడ్డి గోడమీదకు ఘరి ఎలా వచ్చిందో, ఎవరింట్లోంచి ఏ కాకి ఎత్తుకొచ్చి అక్కడ విడచిపెట్టిందో" అంది. నిజంగా నేను చాలా నొచ్చుకున్నాను. నాకు మతిమరుపుతనం ఎక్కువ. డబ్బు ఎక్కడబడితే అక్కడ విడచి పెట్టేస్తాను. మళ్ళీ ఎప్పుడో అప్పుడు ఆ డబ్బు ఎక్కడో అక్కడ ప్రత్యక్షమవడం జరుగుతూనే ఉంటుంది.

మరునాడుదయం, ఆఫీసుకు వెళ్ళేసమయం ఆసన్నమయ్యేవరకూ లైబ్రరీలో పత్రికలు తిరగేసి, ఇంటికి బయలుదేరా. ఇంటిగుమ్మం ఎక్కేటప్పటికి మా ఆవిడతో అప్పటివరకూ దొడ్డిగుమ్మంగ్గర ఉండి మాట్లాడే, మాఇంటికి నాలుగిళ్ళ అవతల కాపురంచేస్తున్న అమ్మాయి-తుర్రున పారిపోయింది. నేను రివ్వున ఇంట్లోకి వచ్చాను. అసలు మగవాళ్ళకు ఆడవాళ్ళు ఏమి మాట్లాడుకుంటారో తెలుసుకోవాలన్న కుతూహలం బహు జాస్తీ! అంచాతనే, నేను చురుగ్గా మా ఆవిడదగ్గరకు పోయి, "ఏమిటీ సంగతి" అన్నా నవ్వుతూ. ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. ఎంచేతనో మనిషి అదోలా వుంది. నేను, "ఏం అలాగున్నావ్" అని మాత్రం అనకుండా, "అంతా క్షేమమేనా" అన్నా. దానికి కూడా ఆమె జవాబు చెప్పలేదు. కాని ఏదో ఓ పని చేసుకోవటానికి ప్రయత్నిస్తూంది. అయినా ఏం చెయ్యాలో ఆమెకేమీ తోచేదనుకుంటా; ఏ పనీ చేయలేకపోతూంది. కాని కాస్సేపాగి తనే, "రాత్రి మీ రన్నట్టుగా నేను దొంగనే" అంది. నా గుండెల్లో పిడుగుపడ్డట్టయింది. పాపం! రాత్రంతా నే నన్న మాటమీదే మథనపడుతూ నిద్రపోయిందేమో! ప్రొద్దుట, నా నోట్సు పుస్తకంలోంచి జారిపడ్డ డబ్బు సంగతి చెప్తే అంతా సరిపోతుందనుకుంటూ, ఆ మాట చెప్పా. కాని ఆమె మళ్ళీ, "కాదు. నేను నిజంగా దొంగనే"

అంది. "నీకేమైనా మతిపోయిందా. నా తప్పు నేను ఒప్పుకుంటున్నాగా. ఇంకెప్పుడైనా అట్లాంటి పొరపాటు మాటలంటే—" అని ఏదో నేననబోతూ ఉండగా, "వాళ్ళింట్లో వెండిగిన్నె కనబడటంలేదని ఇప్పుడే పార్వతి చెప్పింది." ఈ ముక్క లన్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్ళ చుక్కలు నిలుచున్నాయి. "మరి ఆ గిన్నె వాళ్ళదేమో చూపించలేకపోయావా?" అన్నా. కాని ఆమె, "ఏమో, నా నోటివెంట మాట రాలేదు. ఏమీ మాట్లాడలేకపోయాను. అప్పుడే మీరు వచ్చారు. ఆ అమ్మాయి వెళ్లిపోయింది" అంది. నేను "ఓహో" అనుకున్నా. ఇదంతా ధూళి మహిమ! అది ఎవరి హృదయాల్లో, ఏ రూపంలో ఉంటుందో చెప్పలేం. ఎప్పుడు ఎట్లా బయటపడుతుందో అంతకన్నా చెప్పలేం! "పోనీ ఇప్పుడైనా తీసుకెళ్ళి ఇచ్చేసేయ్" అన్నా. అందు కామె, "ఇప్పుడెలా? నన్నేమనుకుంటుంది?" అంది. నిజంగా మానవులు ఓ తప్పుచేసి మళ్లీ దాన్ని కాపాడుకోవడానికి ఇంకో తప్పు ఎట్లా చేస్తారో!

"మరి ఏం చేద్దామని నీ ఉద్దేశ్యం" అన్నా. "ఆ దెయ్యపు గిన్నెను విసిరేస్తాను" అంది పిచ్చిగా. అప్పుడు నేనో ఉపాయం చెప్పాను. అన్ని విధాలా చక్కనైన ఉపాయం! అది మరేమీలేదు. "మా ఆయనగారు స్నానాలగది దగ్గరకు ఇప్పుడిలా వెళ్ళారు. మరి ఏ కాకి పెట్టిందో ఆ గోడమీద ఈ వెండిగిన్నె కనిపించింది. అది ఆయన తీసుకొచ్చి నాకు చూపిస్తే— నువ్వు చెప్పావుగా పార్వతీ, మీ గిన్నె పోయిందని—ఇలా తీసుకొచ్చేశాను. ఇది మీదేనేమో చూడు" అని తమాషాగా వాగేసిరమ్మన్నా. మా ఆవిడ మొదట తటపటాయించింది. చివరికి ఒప్పుకుంది.

వాళ్ళింటికి వెళ్ళిన మాఆవిడ ఎప్పుడువస్తుందా అని ఆమె రాకకోసం ఎంతో ఎదురు చూశాను. ఆమె రాగానే, "ఏం, ఏమన్నారు" అన్నాను. మా ఆవిడ, "వాళ్ళదేనట"అంది. "సరిగ్గా నేను చెప్పినట్లే చెప్పావా?" అన్నాను నా తెలివికి నేనే ముగ్ధుణ్ణయిపోయి. మా ఆవిడ, "ఆ—" అంటూ కాస్సేపాగి, "నువ్వుకాబట్టి ఇచ్చావు. ఈవీధిలో ఇంకెవరికి దొరికినా ఇచ్చేవారుకాదు" అని వాళ్ళన్నట్టుగా చెప్పింది. వెంటనే నేను, "ఔను నువ్వు కాబట్టి—"అని పకపకా నవ్వాను. పాపం మా ఆవిడ నా నవ్వును మాత్రం అందుకోలేకపోయింది.

# పొగాకు పంట : రైతుల, కార్మికుల స్థితి

రావి చినవెంగయ్య

1951లో గుంటూరు పుగాకు మార్కెటింగ్ కమిటీ ఆక్షన్ పద్ధతిని అమలు జరిపింది. దీనివల్ల రైతుకి ఎంతో ఉపయోగం వుంటుందని ఆశించటము జరిగింది. ఆశించిన ఫలితాలు మాత్రం చేకూరకపోగా ఎన్నో సమస్యల్ని లేవనెత్తింది. పైగా యీ సంవత్సరం మంగళగిరిలో గూడా అమలు జరిపారు. వచ్చే సంవత్సరం తాడికొండకి గూడ విస్తృతం చేయాలనే తలంపుతో వున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అమలు జరిపిన గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లో పుగాకు కార్మికులు వేలాదిగా నిరుద్యోగులుగా మారిపొయ్యారు. సంవత్సరానికి దాదాపు తొమ్మిది పదినెలలు పనివుండే యీ కార్మికులకు యీ రెండు సంవత్సరాల్లో మూడు నెలలకంటె మించి పనిలేకుండా పోయింది. ఇలా పనిలేకుండా పోవటానికి కారణము నూటికి పండిన పంటలో 90పాళ్ళు కొనే విదేశీ పెట్టుబడి దార్లయిన ఐ. యల్. టి. డి., నేషనల్; బి. ఐ. టి. లాంటి కంపెనీలు యీ ఆక్షన్ యార్డులోనికి వచ్చి కొనకపోవటమే. ఒక వేళ వచ్చి కొన్నా ఆ కొనేదిగూడ గిట్టుబాటు కావటంలేదనే సాకుతో ఎంతో పరిమితంగా కొంటున్నారు. వాస్తవంగా యీ విదేశీ పెట్టుబడిదార్లకు గిట్టుబాటు కాకపోతే, యిక గిట్టుబాటయ్యే పెట్టుబడిదారులు లేరనడంలో ఆశ్చర్యం